ఒత్తిడిని జయిస్తే విజయం

- ఇష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు
- మార్చి 6 నుంచి ఇంటర్ పరీక్షలు
- మార్చి 21 నుంచి పది పరీక్షలు

బూర్గంపాడు: పరీక్షల సీజన్ వచ్చింది. ఇప్పటి వరకు పుస్తకాలతో కుస్తీ పట్టిన విద్యార్థులు తమ భవితవ్యం తేల్చుకోనున్నారు. మార్చి 6 నుంచి ఇంటర్మీడియట్, మార్చి 21 నుంచి పది పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఏడాదిపాటు ప్రశాంతంగా చదువుకున్న విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలంటే ఒకింత ఆందోళన, భయం కలగడం సహజం. ఈ సమయంలోనే విద్యార్థులపై మానసిక ఒత్తిడి పెరుగుతుంది. అత్యధిక మార్కులు, గ్రేడులు సాధించాలనే పట్టుదల ఒకవైపు, లక్ష్యాలను చేరుకుంటామా లేదా అనే ఆందోళన మరోవైపు విద్యార్థుల్లో కనిపిస్తుంటుంది. ఈ తరుణంలో భయం వీడి ఆత్మ విశ్వాసంతో లక్ష్యసాధనపై దృష్టి పెడితే విజయం సాధించవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. ఏడాది పాటు చదువుకున్న పాఠాలను క్రమపద్ధతిలో పునఃశ్చరణ చేసుకుంటే మంచి మార్కులు సాధించే అవకాశాలు మెండుగా ఉంటాయి. కొంతమంది విద్యార్థులు పరీక్షలకు ముందు గంటల తరబడి చదువుతుంటారు. పరీక్ష కేంద్రంలోకి వెళ్లగానే చదివిన అంశాలు మర్చిపోతుంటారు. ఇలాంటి సమయంలోనే విద్యార్థులు ధైర్యంతో ఆత్మవిశ్వాసంతో ఉండాలి. ఎలాంటి ఆందోళనలకు గురికాకుండా పరీక్షా పత్రాలను ఒకటికి రెండుసార్లు చదువుకుని ముందుగా తనకు తెలిసిన జవాబులను రాసుకోవాలి. తరువాత గుర్తుకు రాని విషయాలను జ్ఞప్తికి తెచ్చుకుని సమాధానాలు రాసుకోవాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ ఆందోళనకు గురికాకూడదు. ఆందోళనలో ఉంటే మనకు తెలిసిన విషయాలను కూడా మరచిపోయే ప్రమాదముంది. ఏకాగ్రతతో ప్రశ్నాపత్రంలో తెలిసిన ప్రశ్నలకు సమాధానాలు రాసుకుని, గుర్తుకు రాని జవాబులున్న ప్రశ్నలపై ప్రశాంతంగా ఆలోచించి సమాధానాలు రాసుకోవాలి. పరీక్షలు రాసేటప్పుడు సమయపాలన కూడా చాలా అవసరం. నిర్ణీత గడువులో అన్ని ప్రశ్నలకు సమాధానాలు రాసుకునే విధంగా సమయాన్ని కేటాయించుకోవాలి. పరీక్షల సమయంలో ఇతర ఏ విషయాలపై మనసు పెట్టకూడదు. మనసు ప్రశాంతంగా ఉంచుకునేందుకు ప్రయత్నించాలి. పరీక్షల ముందు విద్యార్థులు ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవాలి. ఆరోగ్య పరిరక్షణకు సరైన పౌష్టికాహారం తీసుకోవాలి. పరీక్షల సమయంలో జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉంటే మంచిది. పరీక్షల సమయంలో రేయింబవళ్లు చదివి నిద్ర లేకుండా చేసుకోవద్దు. విద్యార్థులు పరీక్షల సమయంలో కూడా ఎప్పటి మాదిరిగానే ప్రశాంతమైన నిద్రపోవాలి.


పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు

భయం వీడాలి



పరీక్షలంటే భయం వీడితే సులువుగా విజయం సాధించవచ్చు. పరీక్షలంటే ప్రశాంతంగా ఉండాలి. ఏడాదిపాటు చదివిన పాఠాలను పరీక్షలకు ముందు పునఃశ్చరణ చేసుకోవాలి. ముఖ్యాంశాలను గుర్తుంచుకునేందుకు మెలకువలు పాటించాలి. ఉత్తమ ఫలితాలు సాధించేందుకు మానసికంగా సన్నద్ధం కావాలి.

–జి.చిన్న్యా, ప్రిన్సిపాల్, జీజేసీ, బూర్గంపాడు

మానసికంగా సిద్ధం కావాలి



విద్యార్థులు పరీక్షలకు మానసికంగా సిద్ధమైతే మంచి ఫలితాలు వస్తాయి. ఆందోళన, ఒత్తిడికి గురికావొద్దు. పరీక్షల సమయంలో పౌష్టికాహారం తీసుకోవాలి. పరీక్షలకు ముందు ఓ గంట చదివితే అందులో పావుగంట పాటు రివిజన్ చేసుకునే విధంగా ఉండాలి.

–డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, పిల్లల వైద్యనిపుణులు

క్లుప్తంగా

స్నేహితుని కుటుంబానికి అండగా..


నగదు అందజేస్తున్న యువకులు

దుమ్ముగూడెం: మండలంలోని మంగువాయి బాడవ గ్రామానికి చెందిన కల్లూరి చరణ్‌బాబు కుటుంబానికి అండగా దుమ్ముగూడెం యువత రూ.లక్ష ఆర్థికసాయం ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో తెల్లం హరికృష్ణ, బొల్లె రాము, కుంజా రఘు, గోసుల వెంకట్, కల్లూరి సుమన్, సాధనపల్లి హేమంత్, యడ్ల శివ, పాశం సందీప్ కుమార్, తోట రమేశ్, ఉబ్బ శివ, సొందె రమేశ్, సోయం గోవింద్, మైత హరి రోహిత్, చిరంజీవి, కొమరం శివ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు ఆహ్వానపత్రిక


ఎమ్మెల్యేకు ఆహ్వానపత్రిక అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

అశ్వాపురం: మండలంలోని మొండికుంట గ్రామంలో రామాలయం నిర్మాణం పూర్తయి ఈ నెల 4 నుంచి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలకు రావాలని ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు ఆదివారం పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, మణుగూరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొల్లోజు అయోధ్యాచారిని కలిసి ఆహ్వానపత్రికను అందజేశారు. ఈ నెల 9న జరిగే విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవానికి రావాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ నిర్మాణ కమిటీ చైర్మన్ మర్రి మల్లారెడ్డి, జాలె రామకృష్ణారెడ్డి, కాసరబాద శ్రీనివాస్, కమటం నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి


దుద్దిళ్ల శ్రీపాదరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

మణుగూరురూరల్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు 88వ జయంతిని ఆదివారం సంతోష్‌నగర్‌లోని శ్రీవిద్యాభ్యాస (బాలవెలుగు) పాఠశాలలో సింగరేణి ఆర్జీ–1 జీఎం డి.లలిత్‌కుమార్–అనిత దంపతుల సహకారంతో నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో తొలుత శ్రీపాదరావు చిత్రపటానికి మణుగూరు ఏరియా ఐఎన్‌టీయూసీ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు వత్సవాయి కృష్ణంరాజు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సింగరేణి సేవా సమితి సభ్యులు ఎస్‌డీ నాసర్‌పాషా, మంగీలాల్, ఐఎన్‌టీయూసీ నాయకుడు పి.రామారావు, శ్రీవిద్యాభ్యాస పాఠశాల నిర్వాహకులు బి.జగన్మోహన్‌రెడ్డి, ఉపాధ్యాయులు స్వాతి, సిబ్బంది సుజాత, రాధ తదితరులు పాల్గొన్నారు.

శ్రీపాదరావుకు నివాళులు

భద్రాచలం: ఉమ్మడి ఏపీ అసెంబ్లీ మాజీ స్పీకర్ శ్రీపాదరావు జయంతి సందర్భంగా ఆదివారం ఘన నివాళులర్పించారు. ఐటీడీఏ సమావేశపు మందిరంలో జరిగిన కార్యక్రమంలో ప్రాజెక్టు మానిటరింగ్ విభాగపు ఏపీఎంఓ రమణయ్య శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాల వేసి మాట్లాడారు. కార్యక్రమంలో డీఎస్‌ఓ ప్రభాకర్ రావు, టీఏ శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన జాతర

అశ్వారావుపేటరూరల్: మండలంలోని మామిళ్లవారిగూడెం గ్రామంలోని శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి ఆలయం వద్ద కొద్ది రోజులుగా సాగుతున్న జాతర మహోత్సవాలు ఆదివారం రాత్రితో ముగిశాయి. ఉదయం ఆలయంలో భక్తులు స్వామి వారిని దర్శించుకొని పూజలు చేయగా, జాతర ఉత్సవాల్లో భాగంగా ఆలయం వద్ద కోలాట నృత్య ప్రదర్శనలు చేశారు.

పదో తరగతి విద్యార్థులకు పెన్నులు పంపిణీ

భద్రాచలం: పట్టణంలోని సరస్వతి శిశు మందిర్‌లో పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు సోమవారం పెన్నులు పంపిణీ చేశారు. చిలుకూరు బాలాజీ శివాలయం ప్రధాన అర్చకుడు ఆత్మరామ్ మహరాజ్ ఇచ్చిన పెన్నులను నిష్కామ ఆధ్యాత్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో అందజేశారు. విద్యార్థులు పరీక్షలు భయం లేకుండా రాయాలని ఆకాంక్షించారు. హెచ్‌ఎం మరిగంటి గీత తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై మంత్రి ఆరా


మంత్రితో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

దమ్మపేట: మండలంలోని మారుమూల అటవీ ప్రాంతం, కొండరెడ్లు నివసిస్తున్న పూసుకుంట గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆరా తీశారు. మండలంలోని గండుగులపల్లి నివాసంలో మంత్రి తుమ్మలను, ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలోని కాంగ్రెస్ నాయకులు, స్థానిక మండల నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పూసుకుంటలో జరుగుతున్న అభివృద్ధి పనులు, పామాయిల్ సాగు తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కొయ్యల అచ్యుతరావు, కేవీ సత్యనారాయణ, కాసాని నాగప్రసాద్, ఎర్రా వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

డైరెక్టర్లకు 'ఐఎన్‌టీయూసీ' సన్మానం

మణుగూరుటౌన్: సింగరేణి కాలరీస్ నూతన డైరెక్టర్ (ఆపరేషన్స్), ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్ డైరెక్టర్లుగా బాధ్యతలు స్వీకరించిన సూర్యనారాయణ, వెంకటేశ్వర్లును మణుగూరు ఐఎన్‌టీయూసీ బ్రాంచ్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం సన్మానించారు. కొత్తగూడెం కార్పొరేట్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా డైరెక్టర్లను కలిసిన ఐఎన్‌టీయూసీ బ్రాంచ్ కమిటీ ఆత్మీయ సన్మానం నిర్వహించి శుభాకాంక్షలు తెలిపింది. కార్యక్రమంలో వత్సవాయి కృష్ణంరాజు, త్యాగరాజు, అల్బర్ట్, షాబుద్దీన్, సూరపాక రాములు, అబ్దుల్ రవూఫ్, బుర్ర వెంకటేశ్వర్లు, బానోత్ కృష్ణ, పుసులూరి రామారావు, రామకృష్ణ, ప్రతాప్‌రెడ్డి, గోపి, ప్రతాప్‌రెడ్డి, మల్లికార్జున్, అజిత్, అశోక్, మిద్దెపాక శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


డైరెక్టర్‌ను సన్మానిస్తున్న నాయకులు

రంజాన్ ఉపవాస దీక్షలు షురూ..


జామ మస్జీద్ ఇఫ్తార్ విందులో ముస్లింలు

కరకగూడెం: ముస్లింలకు రంజాన్ మాసం అత్యంత పవిత్రమైనది. ఆదివారం ఉపవాస దీక్షలు ప్రారంభమయ్యాయి. ఈ మాసంలో ఉపవాసం ఉండటం, దానధర్మాలు చేయడం, మంచి పనులు చేయడం వంటి వాటికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. సాయంత్రం సమయంలో ఉపవాస దీక్షలు (ఇఫ్తార్) విరమిస్తారు. స్వీయ నియంత్రణ, దైవభక్తి, పేదవారి పట్ల కరుణ చూపడం ఈ ఉపవాస దీక్షల ముఖ్య ఉద్దేశమని కరకగూడెం జామా మస్జీద్ మౌలానా ఫిరోజ్ తెలిపారు.

బావిలో నాగుపాము ప్రత్యక్షం

పినపాక: మండలంలోని ఉప్పాక యూపీఎస్ ఆవరణలో గల బావిలో నాగుపాము ప్రత్యక్షమైంది. ఆదివారం పిల్లలు స్కూల్‌లో ఆడుకుంటున్న సమయంలో బావిలో పాము కనపడినట్లు తెలిపారు. గ్రామస్తులు వెళ్లి చూడగా ఆరడుగుల నాగపాము బావిలో తిరుగుతూ కనిపించింది. వెంటనే అధికారులకు సమాచారం అందించారు.



సీఎస్ఐ చర్చిలో కోతకాలపు పండుగ


మాట్లాడుతున్న పాస్టర్ జాన్‌శ్రీనివాస్

చంద్రుగొండ: మండలంలోని గానుగపాడు సీఎస్ఐ చర్చిలో ఆదివారం కోతకాలపు పండుగను ఘనంగా నిర్వహించారు. పాస్టర్ రెవరెండ్ ఆంబ్రోస్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో సింగభూపాలెం ఫాస్టెస్ట్ చైర్మన్ పాస్టర్ జి.జాన్‌శ్రీనివాస్ పాల్గొని మాట్లాడారు. వరికూటి యోహాను, తీట్ల కేపా పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దమ్మపేట: మండలంలోని మందలపల్లి, గట్టుగూడెం గ్రామాల పరిధిలో విద్యుత్ సరఫరాకు సోమవారం అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఏడీఈ వెంకటరత్నం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 33 కేవీ విద్యుత్ లైన్ పనుల కారణంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఆయా గ్రామాల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

దుమ్ముగూడెం మండలంలో..

దుమ్ముగూడెం: మండలంలోని నర్సాపురం ఫీడర్‌లో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌శాఖ ఏఈ మోహన్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సీతారాంపురం గ్రామంలో అభివృద్ధి పనుల్లో భాగంగా కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్నారని, వినియోగదారులు, రైతులు సహకరించాలని కోరారు.

ముత్యాలమ్మ ఆలయంలో పూజలు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని వినాయకపురం గ్రామంలోని శ్రీ చిలకలగండి ముత్యాలమ్మ తల్లి ఆలయంలో ఆదివారం భక్తులు పూజలు చేశారు. ఉదయం నుంచే వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అమ్మవారి ఆలయానికి తరలివచ్చి, మొక్కులు చెల్లించుకున్నారు. దీంతో ఆలయం వద్ద సందడి నెలకొంది.

పాదెం వీరయ్యకు ఎమ్మెల్సీ ఇవ్వాలి

అశ్వాపురం: కాంగ్రెస్ పార్టీకి విధేయుడిగా ఉండి ప్రలోభాలకు లొంగకుండా కార్యకర్తలకు కష్టకాలంలో అండగా నిలిచిన డీసీసీ అధ్యక్షుడు పాదెం వీరయ్యకు ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి తూము వీరరాఘవులు ఆదివారం కోరారు. కాంగ్రెస్ అధికారంలో లేకున్నా పార్టీ వెన్నంటే ఉండి కార్యకర్తలకు భరోసా కల్పించిన వీరయ్యకు ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

పాస్టర్‌పై దాడి

బూర్గంపాడు: సారపాకలోని గాంధీనగర్‌లో శనివారం రాత్రి పాస్టర్ కాకాని రాంబాబుపై నలుగురు వ్యక్తులు దాడి చేయడంతో తీవ్రగాయాలయ్యాయి. సమాచారమందున్న ఎస్ఐ నాగభిక్షం ఘటనా ప్రాంతానికి చేరుకుని క్షతగాత్రుడిని భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు. సోదరుల మధ్య గొడవలే ఈ దాడికి కారణమని సమాచారం. రాంబాబు గాంధీనగర్‌లో చర్చి పాస్టర్‌గా పనిచేస్తున్నాడు. తనను నలుగురు వ్యక్తులు కత్తులతో పొడిచి చంపేందుకు యత్నించారని బాధితుడు తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

ములకలపల్లి: పేకాట స్థావరంపై పోలీసులు ఆదివారం దాడి చేశారు. ఎస్ఐ రాజశేఖర్ కథనం ప్రకారం.. మండలంలోని పాతూరు శివారులో పేకాట ఆడుతున్నట్లు సమాచారం మేరకు సీసీఎస్, స్థానిక పోలీసులు దాడులు నిర్వహించారు. ఏడుగురు వ్యక్తులను అరెస్ట్ చేశారు. రూ.3,110 నగదు, మూడు బైక్‌లు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

సింగరేణి సొమ్ము పక్కదారి..!


జీఎం కార్యాలయం

మణుగూరుటౌన్: సింగరేణిలో ఓ అధికారి అద్దె ప్రాతిపదికన పెట్టుకున్న కార్లు కాంట్రాక్టర్‌కి కాసులు కురిపిస్తోంది. అధికారి అనుయాయుడు కాంట్రాక్టర్‌కి తోడవడంతో డ్రైవర్లు లేకుండా ఏళ్ల తరబడి లక్షల్లో బిల్లులు డ్రా చేసుకుంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని జీఎం కార్యాలయంలో ఓ బినామీ కాంట్రాక్టర్ పేరుతో నడుస్తున్న అద్దె వాహనాలపై పర్యవేక్షణ కరువవడంతో కింది స్థాయి ఉద్యోగి చేతివాటం ప్రదర్శిస్తోందనే ఆరోపణలు వస్తున్నాయి. జీఎం కార్యాలయంలో నడిచే 24 గంటల అద్దె వాహనాలకు నిబంధనల ప్రకారం కచ్చితంగా ముగ్గురు డ్రైవర్లు ఉండాలి. అందుకు గాను ఒక్కో కార్మికుడికి మస్టర్ రూ.739 అందిస్తుంది. 24 గంటల బండికి ముగ్గురు డ్రైవర్లు ఉండాల్సిన టెండర్‌కి ఇద్దరు డ్రైవర్లు, 16 గంటల బండికి ఇద్దరు డ్రైవర్లు ఉండాల్సిన టెండర్‌కి ఒక్కరిని ఉంచి తప్పుడు డ్రైవర్ ధ్రువపత్రాలు పెట్టి జీతాలు డ్రా చేసుకుంటున్నారని తెలుస్తోంది.

విజిలెన్స్ విచారణ చేపట్టాలి..

సింగరేణి నిర్వాసితులకు, సమీప ప్రాంత ప్రజలకు ఉపాధి కల్పించే విషయంలో సానుకూలంగా వ్యవహరిస్తోంది. కానీ జీఎం కార్యాలయంలో తిరిగే వాహనాలకు డ్రైవర్లు పెట్టుకునే అవకాశం ఉన్నా ఉన్నవారితోనే నడిపిస్తూ టెండర్ నిబంధనలు తుంగలో తొక్కి ఒక వాహనానికి ఒకరి జీతాన్ని పక్కదారి పట్టిస్తూ ఉన్న డ్రైవర్లనే సరిపెడుతూ.. వారితోనే వెట్టిచాకిరీ చేయిస్తూ.. కాంట్రాక్టర్‌తో కుమ్మక్కై సింగరేణి సొమ్మును జేబులో వేసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీనిపై విజిలెన్స్ విచారణ చేపట్టాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయమై వివరణ కోరేందుకు జీఎం దుర్గం రాంచందర్‌ను సంప్రదించగా, అందుబాటులోకి రాలేదు.

కరకట్ట నిర్మాణంపై స్పష్టతనివ్వాలి


మాట్లాడుతున్న కొండా చరణ్

చర్ల: గత ప్రభుత్వం నిర్మాణం చేపట్టిన సీతమ్మ సాగర్ ప్రాజెక్టు నిర్మాణం వల్ల ఏజెన్సీలో రైతులు సాగు చేసుకునే వందలాది ఎకరాల సాగుభూములు కోల్పోయారని, ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత పనులు సాగడం లేదని, గోదావరికి ఇరువైపులా కరకట్టల నిర్మాణాలు చేపట్టినప్పటికీ వాటిని పునః నిర్మిస్తారా? లేదా? అనే అంశంపై ప్రభుత్వం స్పష్టత నివ్వాలని బీఎస్పీ భద్రాచలం నియోజకవర్గ అధ్యక్షుడు కొండా చరణ్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో కొండా కౌశిక్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో నిర్వాసితులకు పరిహారం చెల్లించాలని ఆందోళనలు కొనసాగాయని, ప్రాజెక్టు, కరకట్టల నిర్మాణ పనులు నిలిచిపోయి రెండేళ్లు కావస్తుండగా, స్పష్టత రావడం లేదన్నారు. కరకట్ట నిర్మాణం చేపట్టిన కొరెగడ్డలో సాగులో ఉన్న ప్రతీ రైతు భూమికి పరిహారం చెల్లించాలని, కరకట్టల నిర్మాణం చేపట్టకపోతే సాగులో ఉన్న భూములకు హక్కుపత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సామల ప్రవీణ్, చెన్నం మోహన్‌రావు, ఏకుల వెంకటేశ్వర్లు, పున్నారావు తదితరులు పాల్గొన్నారు.

చట్టాలను పకడ్బందీగా అమలు చేయండి

భద్రాచలం: ఏజెన్సీ చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు ధరావత్ సురేశ్‌నాయక్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని సుందరయ్యనగర్ కాలనీలో సేవాలాల్ సేన మండల అధ్యక్షుడు బోడ వీరేందర్ నాయక్ ఆధ్వర్యంలో మండలస్థాయి సమావేశం నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లాలో ఏజెన్సీ చట్టాలు అమలుకు నోచుకోవడం లేదని, 1/70, పీసా చట్టాలను నిర్వీర్యం చేస్తున్నారని, అధికారులే ఏజెన్సీ చట్టాలను తుంగలో తొక్కుతూ గిరిజన ప్రజలకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో టెండర్లను గిరిజన ప్రజలకే ఇవ్వాలన్న చట్టాలు ఉన్నప్పటికీ వాటిని ఉల్లంఘిస్తూ గిరిజనేతురులకు కేటాయిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో లావుడ్యా వెంకటేశ్‌నాయక్, బానోత్ నాగరాజునాయక్, రమేశ్‌నాయక్, కిషన్‌నాయక్, సీతారాంనాయక్, సురేశ్‌నాయక్, శేఖర్‌నాయక్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సురేశ్‌నాయక్

ఉచిత వైద్య శిబిరాలకు స్పందన


దుమ్ముగూడెం: శిబిరాన్ని ప్రారంభిస్తున్న సీతమ్మ


అశ్వాపురం: శిబిరాన్ని ప్రారంభిస్తున్న హేమంత్

దుమ్ముగూడెం: మండలంలోని చిన్ననల్లబల్లి గ్రామంలో ఆదివారం ఏర్పాటు చేసిన మెగా వైద్య శిబిరం విజయవంతమైంది. శ్రీ సురక్ష మల్టీ స్పెషాలిటీ వైద్యశాల, బిగ్ టీవీ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ముందుగా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తెల్లం సీతమ్మ ప్రారంభించి, మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతంలో పేద ప్రజల కోసం ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. శిబిరంలో 200 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఈసీజీ, హెచ్‌బి, షుగర్ పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు అక్కినేని లోకేశ్, సూరపనేని శ్రీక్రాంతి, కొప్పుల మురళి, గిరి పాల్గొన్నారు.

అశ్వాపురం మండలంలో..

అశ్వాపురం: ఏజెన్సీ ప్రాంత ప్రజల కోసం అధునాతన వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎముకల వైద్య నిపుణులు డాక్టర్ హేమంత్ కాకర్ల అన్నారు. భద్రాచలం నేతాజీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం మొండికుంట గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యులు హేమంత్, సుకన్యరెడ్డి ప్రారంభించారు. 150 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఎముకల సాంద్రత బీఎండీ పరీక్ష, ఈసీజీ, షుగర్ పరీక్షలు ఉచితంగా నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి నిర్వాహకులు జక్కిరెడ్డి శ్రీనివాసరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.


బూర్గంపాడు: వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

బూర్గంపాడు మండలంలో..

బూర్గంపాడు: వేసవిలో ఆరోగ్య రక్షణకు ప్రతిఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. లక్ష్మీపురం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఆదివారం భద్రాచలం నీరజా మల్టీ స్పెషాలిటీ వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. శిబిరాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ.. మారుతున్న జీవనశైలితో అనేక రోగాలు సంక్రమిస్తున్నాయని, ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా ఎప్పటికప్పుడు వైద్యపరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా సుమారు 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలో డాక్టర్ నీరజా రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

పట్టించుకోండి..

అశ్వారావుపేటరూరల్: మండలంలోని కన్నాయిగూడెం – కావడిగుండ్ల గ్రామాల మధ్యలోని హైలెవల్ వంతెన వద్ద అప్రోచ్ రోడ్డు కోతకు గురై ప్రమాదకరంగా మారింది. గతేడాది జూలైలో కురిసిన భారీ వర్షాలతో వాగు ఉప్పొంగి ప్రవహించగా, వంతెన అప్రోచ్ రోడ్డు కొట్టుకుపోయింది. దీంతో పంచాయతీ రాజ్ శాఖ అధికారులు తాత్కాలికంగా మరమ్మతులు చేసి రాకపోకలను పునరుద్ధరించారు. ఆ తర్వాత మట్టి రోడ్డు కోతకు గురి కాగా, నేటికీ పట్టించుకోలేదు. దీంతో ప్రమాదాలు జరిగితే కానీ పట్టించుకోరా అంటూ.. అటువైపు రాకపోకలు సాగించే వాహనదారులు ప్రశ్నిస్తున్నారు.


కావడిగుండ్ల వంతెన వద్ద కోతకు గురైన అప్రోచ్ రోడ్డు